క్లుప్తంగా

ముగిసిన విలీన ప్రక్రియ



విలీనమైన బ్యాంకు

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విలీనం ప్రక్రియ పూర్తయింది. సోమవారం దెందులూరు ఏపీ గ్రామీణ బ్యాంక్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి బ్యాంక్ ఇకపై ఏపీ గ్రామీణ బ్యాంక్‌గా రూపాంతరం చెందింది. విడతల వారీగా జరిగిన విలీన ప్రక్రియ సోమవారం ఉదయం 10 గంటలకు ముగిసిందన్నారు. ఇకపై ఏపీ గ్రామీణ బ్యాంకుగా వినియోగదారులకు సకాలంలో సంతృప్తికరమైన సేవలు అందిస్తుందని మేనేజర్ నాగార్జున అన్నారు.

25 లోపు ఈ క్రాప్ చేయాలి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

దెందులూరు: దెందులూరు మండలంలో ఈ- క్రాప్ పంటలు పలురకాల భూముల యజమానులు ఈనెల 25వ తేదీలోపు ఈ-క్రాప్ చేయించుకోవాలని దెందులూరుమండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం మండలంలో కొవ్వలి, గోపన్నపాలెం గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్‌లో భాగంగా రైతు ఆధార్ పాస్ నంబర్, భూమి పాసుబుక్‌తో పాటు పొలం వద్ద రైతుల ఫోటోలు తీసి ఈ క్రాప్ యాప్‌లో వ్యవసాయ సిబ్బంది అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు.

సుప్రీంకోర్టు విచారణ చేయాలి



నినాదాలు చేస్తున్న మాలమహానాడు నేతలు

దెందులూరు: హర్యానాలో అడిషనల్ డీజీపీ పురాణకుమార్ కుల వివక్ష కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన డీజీపీ, ఎస్పీలను సస్పెండ్ చేయాలని మాల మహానాడు ఏపీ రాష్ట్ర కార్యదర్శి గొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వలిలో మాట్లాడుతూ డీజీపీ, ఎస్పీలను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అరెస్ట్ చేయాలన్నారు. సుప్రీం కోర్టు తక్షణమే అత్యవసరంగా జోక్యం చేసుకొని ఏడీజీపీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ చేయాలన్నారు. గొల్ల కిరణ్‌తో పాటు మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆటోమేటిక్ బెల్ బహూకరణ



విద్యార్థులకు స్వీట్లు పంచుతున్న దాత

దెందులూరు: గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాల హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్‌కు దాత వెన్నమనేని రామకృష్ణ రూ.10 వేలతో ఆటోమేటిక్ బెల్‌ను సోమవారం అందజేశారు. దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో మురళీకృష్ణ కుమార్తె విజయలక్ష్మి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు స్వీట్లు పంచారు. దాతలను పాఠశాల హెచ్ఎం వడ్లపట్ల విజయకుమార్ గ్రంథ పాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గీతా పారాయణలో ఉచిత శిక్షణ



దుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ సర్పంచి

దెందులూరు: గోపన్నపాలెం గ్రామ శివారు ప్రాంతాల్లో చిన్నారులకు నూతన కోదండ రామాలయం నిర్వాహకులు ఏనుగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గీతా పారాయణలో ఉచిత శిక్షణ ఇస్తామని గోపన్నపాలెం గ్రామ మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు అన్నారు. సోమవారం కనకదుర్గమ్మను దర్శించుకుని, ఆలయంలో వారు మాట్లాడుతూ ప్రతి శనివారం సాయంత్రం ఆదివారం ఉదయం చిన్నారులకు గీతా పారాయణాన్ని రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు గ్రంధి ప్రభాకర్‌రావు నేర్పిస్తారన్నారు. ఉచిత శిక్షణ కావలసిన వారు గ్రంధి ప్రభాకర్‌రావు కనకదుర్గమ్మ ఆలయ కమిటీలను సంప్రదించాలని కోరారు.

రక్షక భటులకు నీడ కరువు

- అధ్వానంగా పోలీస్ క్వార్టర్స్
- జిల్లా కేంద్రం నుంచి సిబ్బంది రాకపోకలు
- 30 పోర్షన్లు, కాపురం ఒక్కరూ లేరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పెదవేగిలోని శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

పెదవేగి: సమాజంలో శాంతి భద్రతలు కాపాడే పోలీసుల సేవలు సేవలు అత్యంత కీలకమైనవి. ఉదయం లేచిన దగ్గర నుంచి తమ ఇంటి బాధ్యతలు సైతం పక్కన పెట్టి వృత్తి ధర్మానికి కట్టుబడి సమాజంలో ప్రజల శాంతి భద్రతల కోసం అహర్నిశలు వీరు పాటు పడతారు. చేతిలో లాఠీతో నెత్తి మీద టోపీ ధరించి నిత్యం మనకు కనిపించేది రక్షక భటులు. అలాంటి ఈ రక్షక భటుల నివాసం కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరడంతో వారికి నిలువ నీడ కరువైంది. జిల్లా కేంద్రమైన ఏలూరుకు కూత వేటు దూరంలో జిల్లాలోనే పెద్ద మండలంగా పేరుగాంచిన పెదవేగి మండలంలో ఈ పరిస్థితి ఏర్పడింది. మూడు అంతస్తులు, 30 కుటుంబాలు నివాసం ఉండేలా 2006లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని నిర్మించిన ఈ క్వార్టర్స్ ప్రస్తుతం చిట్టడివిలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత భవంతిని తలపిస్తుంది. ప్రారంభంలో ఉన్న కుటుంబాలు రానురాను క్వార్టర్స్‌ను పట్టించుకునే వారు లేక ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు మొత్తం మూడు అంతస్తులకు ఒక్క కుటుంబం కూడా నివసించకపోవడం గమనార్హం. అన్ని అంతస్తుల్లోని పోర్షన్లు అవశానదశకు చేరుకున్నాయి. ప్రతి పోర్షన్‌లో పైకొప్పులు పెచ్చులూడిపోయి, తలుపులు ఊడిపోయి, ఆవరణ అంతా చిట్టడివిని తలపించేలా పిచ్చిమొక్కలతో భయానకంగా మారింది. శిథిలమైన క్వార్టర్స్‌లో ఉండలేక, సిబ్బంది ఏలూరులోనే నివాసం ఉంటూ డైలీ సర్వీసు చేస్తున్నారు. ఈ క్వార్టర్స్ నివాస యోగ్యంగా లేవని అధికారులు ధృవీకరించారు. ఈ స్టేషన్‌లో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లతో పాటు ఓ మహిళా కానిస్టేబుల్‌తో కలిసి మొత్తం 17 మంది సిబ్బంది ఉన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తదనంతరం ఈ క్వార్టర్స్ వైపు చూసిన వారే కరువయ్యారు. అప్పట్లో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది నివాసం ఉండేందుకు నిర్మించిన ఈ క్వార్టర్స్ క్రమేపీ పట్టించుకునే వారు కరువవడంతో హీనదశకు చేరుకున్నాయి. సిబ్బంది మాత్రం దైనందిన జీవితంలో విధులు ముగించుకుని తిరిగి స్వగృహాలకు చేరుకోవాలంటే ఆనందంగా ఉంటుంది కానీ ఇక్కడ పూర్తిగా విరుద్ధంగా ఉంటుందని వాపోతున్నారు. ఇక్కడే నివాసం ఉండేవారికి పాముల బెడద, డైలీ సర్వీసు చేసేవాళ్ళకు ప్రమాదాల బెడద. ఆ క్వార్టర్స్‌లో నివాసం ఉండలేక క్వార్టర్స్ పరిస్థితి ఎవరితో చెప్పుకోలేక వీరి పరిస్థితి ×కరవమంటే కప్పకు కోపం, విడవ మంటే పాముకు కోపం అన్న చందాన తయారైంది.



చెదలతో ఊడిపోయిన గదుల్లోని తలుపులు



చెత్తా చెదారంతో నిండిన క్వార్టర్స్ గదులు

వేధిస్తున్న సిబ్బంది కొరత

దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా సమస్యాత్మక మండలంగా పేరుగాంచిన పెదవేగి మండలానికి పోలీస్ సిబ్బంది కొరత కొంత వేధిస్తోంది. రికార్డుల్లో లెక్కకు మాత్రం ఇక్కడే పనిచేస్తున్నారని చూపిస్తున్నా, పలు కారణాలతో స్టేషన్ బయట విధులు నిర్వర్తించడంతో స్థానిక సమస్యల పరిష్కారానికి కొంత మేర ఇబ్బంది ఏర్పాడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ పోలీస్ స్టేషన్ ఒక ఎస్సై, ఇద్దరు ఏఎస్సైలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు మొత్తం 28 మంది పోలీస్ సిబ్బంది ఉండాల్సి ఉండగా, కేవలం 17 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు ఒక ఫిర్యాదు రాగానే పోలీస్ సిబ్బంది ఎవరైనా సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపి, ప్రతివాదిని స్టేషన్‌కు రమ్మని చెప్పడం ప్రాథమికంగా చేయాలి. ఇలా చేయడానికి కూడా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సరిపడ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలకు పడుతున్నట్లు వివిధ గ్రామాల నుంచి ముక్తకంఠంతో చెబుతున్నారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు



గౌరీదేవి అమ్మవారు

దెందులూరు: పోతునూరులో నూతనంగా నిర్మించిన శ్రీగౌరీదేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బొడ్డేటి సత్య బాలాజీ పూర్ణిమ దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు అందించారు. పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేసి పూజలు, ఆలయ ప్రదక్షిణ చేశారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. గౌరీదేవి ఉత్సవాల్లో భాగంగా పోతునూరు, కేధవరం, ఉండ్రాజవరం, కొవ్వలి, గుండుగొలను నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించారు.

స్వదేశీ వస్తువులను వినియోగించండి

పెదవేగి: ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను వినియోగించి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పెదవేగి ఎంపీడీఓ కె.రవికుమార్ అన్నారు. సోమవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన కూటమి పాలన



భీమడోలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కారుమూరి సునీల్‌కుమార్, వైసీపీ శ్రేణులు



భీమడోలులో ఎక్సైజ్ సీఐ కల్యాణికి వినతిపత్రం అందిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

- సీబీఐతో విచారణ చేయించాలి
- కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

భీమడోలు: కూటమి ప్రభుత్వ పాలన మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చే దిశగా కల్తీ మద్యాన్ని అందించి పేదల ప్రాణాలను తీస్తుందని ఏలూరు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పిలుపుతో కారుమూరి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నకిలీ మద్యం అరికట్టాలని సోమవారం భీమడోలులో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కల్తీ మద్యంపై కదంతొక్కారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు భీమడోలు జంక్షన్ నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఎక్సైజ్ సీఐ ఎస్.కల్యాణికి కారుమూరి సునీల్‌కుమార్ వినతి పత్రం అందించారు. రాష్ట్రంలోని చిత్తూరు, ఇబ్రహీంపట్నం, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో నకిలీ మద్యంతో పేదల ప్రాణాలు పోయాయన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మద్యాన్ని విక్రయించాలని, తనిఖీలు చేయాలని ఆయన వారిని కోరారు.

ప్రధాన సూత్రధారులను అరెస్టు చేయాలి

రాష్ట్రంలో ఎక్కడ చూసినా నకిలీ మద్యం ఏరులై పారుతుందని, పేదల ప్రాణాలను ఈ సర్కార్ తీస్తుందని, ఈ కేసును వెంటనే సీబీఐతో విచారణ చేయించి ప్రధాన సూత్రధారులను అరెస్ట్ చేయాలని ఏలూరు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరు సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. పేదలకు రూ.99లకే మద్యం అంటూ ఊదరగొట్టారని, కానీ కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా నిర్వహిస్తున్నారని, ఎక్కడ చూసినా బెల్ట్ షాపులతో అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వమే మద్యం అమ్మి వారి ప్రాణాలకు భరోసా కల్పించిందన్నారు. కానీ ఈ కూటమి పాలనలో నకిలీ మద్యం అమ్మి పేదల ప్రాణాలను తీసి వారి ఉసురు కట్టుకుందన్నారు. కార్యక్రమంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండల కన్వీనర్లు రావిపాటి సత్యశ్రీనివాస్, మరడ వెంకట మంగారావు, సంకు సత్యకుమార్, దండు రాము, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మీ, రాష్ట్ర నాయకులు ముళ్లగిరి జాన్సన్, మద్దుల రాజా, ఎలిశెట్టి బాబ్జి, వెజ్జు వెంకటేశ్వరరావు, డాక్టర్ పెనుగొండ బాలు, దొంతంశెట్టి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు గంటా శ్రీనివాస్, ఆల్తి గోపి, రాయి లక్ష్మీ, నియోజకవర్గ నాయకులు పసుపులేటి సత్యనారాయణ, తుమ్మగుంట రంగా, పాము మాన్‌సింగ్, రామిశెట్టి శ్రీనివాసరావు, కొరిపల్లి శ్రీనివాసరావు, రాజుకుమార్‌రాజు, మండల నాయకులు ఆల్తి సురేష్, పులఖండం మధు, చింతల కిషోర్, కూరపాటి రవి, మండల మహిళా నాయకులు మందా జయలక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

వీడని వర్షం.. తప్పని పాట్లు



భీమడోలు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

భీమడోలు: మండల వ్యాప్తంగా సోమవారం కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో 39 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, సూరప్పగూడెం, కురెళ్లగూడెం గ్రామాల్లో రెండున్నర గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజా జీవనం స్తంభించింది. రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ రోడ్డు, రాజులవీధి రోడ్డు, పంచాయతీ రోడ్డు, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. సంతమార్కెట్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. గుండుగొలనులోని ప్రధాన రోడ్డులోని పలు చోట్ల రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు కలవరం చెందుతున్నారు.

వర్షంతో ప్రజల ఇక్కట్లు

ఉంగుటూరు: మండలంలో వర్షం వీడలేదు. రోజు ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనేఉంది. వేకువజామునుంచి ఆకాశం మేఘావృతమై వర్షం పడుతూనేఉంది. సాయంత్రంవరకు కురవడంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు వెళ్లడానికి వీలు లేకుండా అయ్యింది. ఇప్పటికే జిల్లాలో అత్యధిక వర్షం కురిసిన మండలాల్లో ఒకటి ఉంగుటూరుగా నిలిచింది. వరి చేలకు అంతగా అవసరంలేకున్నా కురుస్తున్న వర్షం రైతులకు ఇబ్బందిగామారింది. ప్రజలు నిత్యం పనులు చేసుకునే వారికి ఇబ్బంది ఏర్పడింది.

సీఎంగా వైఎస్ జగన్ పాలన మరువలేం



జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం దంపతులు

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాలన సంక్షేమ పాలన అని ఆయన సీఎంగా ఉన్న సమయంలో తాను దెందులూరు జెడ్పీటీసీగా భారీ మెజారిటీతో విజయం సాధించడం మరువలేనని నిట్టా లీలానవకాంతం అన్నారు. సోమవారం దెందులూరు ఆమె కార్యాలయంలో జెడ్పీటీసీగా నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్యం, గ్రామ స్వరాజ్యం, గడపగడపకు సంక్షేమ పథకాల అందజేత వంటి స్ఫూర్తిదాయకమైన పథకాలను ప్రవేశపెట్టి పటిష్ఠంగా అమలు చేశారన్నారు. దెందులూరు జెడ్పీటీసీగా మండలంలో అనేక సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ అభివృద్ధికి అందరి సహాయ సహకారాలతో కృషి చేశానన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబాలకు తమ కుటుంబం రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నిట్టా గంగరాజు, నేతలు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో భీమడోలు క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో రాణించి, డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికై తమ సత్తా చాటారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 30 మంది బాలబాలికలను అభినందించారు. మండల స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్‌ల్లో తమ ప్రతిభను చాటారు. వారు ఏలూరు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారని హెచ్ఎం జీఎస్ పద్మజ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు అహ్మద్, పీడీలు స్వాతి, శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో సమస్యల పరిష్కారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

దెందులూరు: అవగాహనతో సమస్యలు పరిష్కారమవుతాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే ఫణి కుమార్, రాజమండ్రి వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎస్.ఉజ్వలర్యాలీ అన్నారు. సోమవారం దెందులూరు సచివాలయం ఎదుట రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మకతల కార్యక్రమం ప్రదర్శించారు. గ్రామ సమస్యలు, పంట కాలువలు, గ్రామ పటం, పంట దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు సతీష్, సలీం, మోక్షజ్ఞ, భారత్, ప్రశాంత్ ప్రదర్శన నిర్వహించారు.

పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలి



జవాబు పత్రాలను పరిశీలిస్తున్న ఎంఈవో-2 భాస్కర్‌కుమార్

భీమడోలు: ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించాలని భీమడోలు ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ కోరారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్మెంట్(నిర్మాణాత్మక మూల్యాంకం) రెండు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. గుండుగొలను నెం.2 పాఠశాలలో జరుగుతున్న తెలుగు, లెక్కల పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. అసెస్‌మెంట్ పుస్తకాల్లో విద్యార్థులో రాస్తున్న జవాబు పత్రాలను ఆయన పరిశీలించారు. పలు సూచనలందించారు. విద్యార్థుల చేతిరాత బాగుండేలా ఉపాధ్యాయులు తగు శ్రద్ధ వహించాలని, అక్షరాలు, పదాలకు మధ్య ఖాళీ ఉండేలా చూపాలని వారికి సూచించారు. పరీక్షలకు విద్యార్థులంతా విధిగా హాజరయ్యేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కోరారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలని కోరారు. అనంతరం ఎండీఎం పథకాన్ని ఆయన పరిశీలించి వారికి తగు సూచలనందించారు. పాఠశాలలో భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్లు



చింతలపూడి: ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించి జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణరాజు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని శానిటరీ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వలన ఆకలితో అలమటిస్తున్నారన్నారు. శానిటరీ కార్మికులకు బకాయి వేతనాలు విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేముల రాజు మేరీ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలు, పీఎఫ్‌లను విడుదల చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ముందు పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సంఘం ఏఐటీయూసీ అనుబంధం శాఖ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, 15 నెలల పీఎఫ్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో రాజు, నాగరాజు, కుమారి పాల్గొన్నారు.

విజయవాడ తరలి వెళ్లిన విద్యుత్ ఉద్యోగులు

దెందులూరు: విద్యుత్ శాఖ సిబ్బంది సోమవారం విజయవాడ తరలి వెళ్లారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు దెందులూరు మండలంలో లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, షిఫ్ట్ ఆపరేటర్లు వెళ్లారు. కాంట్రాక్టు ఉద్యోగులను నేరుగా విలీనం చేయాలని జూనియర్ లైన్‌మెన్లను రెగ్యులర్ చేయాలని ప్రమోషన్ కల్పించాలని విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేస్తున్న సంగతి విధితమే. తమ డిమాండ్లు సాధించుకోవడానికి కూటమి ప్రభుత్వానికి తెలిసేలా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నామని విద్యుత్ ఉద్యోగులు తెలిపారు.

జూదరుల అరెస్టు

ఉంగుటూరు: కంసాలిగుంట గ్రామంలో ఆదివారం రాత్రి పేకాట స్థావరంపై చేబ్రోలు పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,130 నగదు, 63 కాయిన్స్, ఐదు కార్లు, ఓ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సూర్యభగవాన్‌కు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశారు. సీఐ పర్యవేక్షణలో ఈ దాడి నిర్వహించారు.

చెక్కల ర్యాంపునకు మరమ్మతులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలోని తూర్పురాజగోపురంలో ధ్వంసమైన చెక్కల ర్యాంపుకు, అలాగే దెబ్బతిన్న స్టీల్ రెయిలింగ్‌కు సోమవారం మరమ్మతులు చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం చెక్కల ర్యాంపు ధ్వంసం.. దెబ్బతిన్న రెయిలింగ్ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆలయ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించారు. ఇంజనీరింగ్ విభాగ డీఈ సుధాకర్, సిబ్బంది పనులను పర్యవేక్షించారు. ర్యాంపు మరమ్మతులతో వీల్ చైర్లలో ఆలయంలోకి వెళ్లి వచ్చే దివ్యాంగులు, భక్తులకు ఇక ఇబ్బందులు తొలగినట్టే.